డాక్టర్

'భగవాన్! ఎందుకు నన్ను డాక్టరుగా చేశావు—' అనుకున్నాడు కృష్ణమూర్తి మరొక్కసారి. ఎడమచేతితో నుదుటిని రుద్దుకున్నాడు. కళ్లు మూసుకున్నాడు.

'డాక్టరైతే అయ్యాను.... శిశువైద్యంలో నిపుణుడి నెందుకవాలి? అరవిచ్చుకుంటున్నపువ్వులు విలవిలలాడుతూ రాలిపోతుంటే—పసిపిల్లలు, డాక్టర్లను చూడకుండా వుండాలనికాబోలు, తమకళ్ళను శాశ్వతంగా మూసేసుకుంటుంటే—ఎందుకు తన డాక్టరుతనం. ఏడవనా? తన చదువూ, తన విజ్ఞానం, తన అనుభవం అంతా ఇసుకగూళ్ళలా కూలిపోతుంటే— ఎందుకొచ్చినవైద్యం, అనిపిస్తుంది.

'నేను మనిషిని—చిన్నవాడిని—అణుమాత్రుడిని —నా అల్పత్వాన్ని నీ విశ్వరూపంలో బెదరగొట్టనేల ప్రభూ—'

*　　*　　*

సాయంకాలం ముగియవచ్చింది. నర్స్ కమల లైట్లు వేయనారంభించింది.

కళ్ళు తెరిచాడు డాక్టర్ కృష్ణమూర్తి. తెల్లటి దుస్తులలోవున్న కమల ఈ లోకపు మనిషికానట్లు కన్పించింది. డాక్టర్ తనను గమనిస్తున్నట్లు తెలియగా ఇటుచూసి నవ్వింది.

'ఏమిటి ఈమె సంతృప్తి? రోగాలమధ్య, చిక్కిపోయిన శరీరాల మధ్య–చావులమధ్య, సగంచచ్చిన మనుష్యులమధ్య ఎక్కడిది ఈమె సంతోషం ?'

డాక్టర్ ! ఏమిటీ ధోరణి–అని ఎవరో వీపుతట్టినట్లయింది. ఉలిక్కిపడ్డాడు కృష్ణమూర్తి. తలను విదిలించాడు. ఏవో సాలెగూళ్ళు విడివడినట్లయింది. ఛీ ఛీ! ఎంత పెడదారిన పడింది తన ఆలోచన!

తన వృత్తిలో ఎంత ఔన్నత్యంవుంది? ఎంతశాంతి వుంది?.... ఆశను, ఆరోగ్యాన్ని, దైవమనుకూలిస్తే ఆయుస్సునూ పంచిపెట్టగల అదృష్టం ఎవరిది. ఒక్క–డాక్టర్లదే కదా!

పోయిన్నెల ఒకఅయిదేళ్ళ అమ్మాయిని తీసుకొచ్చా రెవరో. ఆ అమ్మాయికి విపరీతమైనజ్వరం. తలనొప్పికూడా కాబోలు పాపం. తలను కొట్టుకుంటూంది తన చిన్నారిచేతులతో.

తను ఒకఇంజక్షనిచ్చాడు. ఆ నొప్పికి కెవ్వుమంది పాప. ఆ కళ్ళల్లో–దేవుడిభాష మాట్లాడే ఆ కళ్ళల్లో నీరు నిలిచింది. బాధతో పాప చూచిన చూపుముందు, తనొకదోషిగా నిలిచాడు....'నీకు నొప్పి కలిగించింది. నొప్పికోసంకాదు....నన్ను అర్థం చేసుకోవూ—' అన్నట్లుగా నవ్వాడు, కాని పాప నవ్వలేదు.

మూడవరోజు మళ్ళీ వచ్చింది పాప. నీరసంగావుంది. కాని జ్వరం తగ్గిపోయింది. రెండురాత్రుళ్ళూ బాగా నిద్రపోయిందిట.

"డాక్టర్‌గారూ! మరేమో....మా అమ్మాయికట మంచి తియ్యటి మందు ఇవ్వండి–" అంది వాళ్ళమ్మ.

"అవునా....నీకు తియ్యటిమందుకావాలా–అట్లాగే" అని తానొక సిరప్‌నిచ్చాడు. దానితోబాటు–ఒక రంగు రంగుల బొమ్మవున్న పెద్ద బ్లాటింగ్‌కాగితం ఇచ్చాడు. సందేహపడుతూ, సిగ్గుపడుతూ తీసుకుంది

పాప తీసుకుంటూ తన్నుచూచి నవ్వింది. అవును, పాప తన్నుచూచి నవ్వింది. దేవుడేవచ్చి తనవీపు తట్టినట్లయింది....

ఆ పాపపేరు యశస్విని:.... ఆ యశస్వినీ తనూ ఇప్పుడు స్నేహితులు !!

ఈ భాగ్యమంతా ఎవరిది? తనది, ఒకడాక్టర్ ది: కాని, కాని తను ఇందాకటినుండి చీకటిలోపడిపోయాడు. వెలుతురు విషయమే మరిచిపోయాడు.

అవునుమరి, ఆరోనెంబర్ గదిలో, ఆ పాపనిచూస్తుంటే ఎవరికయినా సరే వెలుతురు ఎట్లా గుర్తుకొస్తుంది ?

ఆ అబ్బాయినిచూస్తే గుండె కలియబెడుతుంది. ఆ చిన్నదేహంలో ఇంకా ప్రాణంవుంది. కాని అది పెనుగాలిలో విలవిలలాడే చిన్నదీపంలా-కొట్టుకులాడుతూంది. నొప్పితో కళ్ళు సగంతెరిచి-రాత్రిపూట అడవిలో ఏదోజంతువు అరిచినట్లు-వాడు, ఆ పసివాడు మాట్లాడుతుంటే-వాడి తలిదండ్రులప్రాణాలు ఎగిరిపోయేవి. క్షణ క్షణమూ,నరనరమూ వాడి యాతననంతా వాళ్ళిద్దరూ అనుభవించేవాళ్లు. అది తనకు తెలుసు.

కాని తను ఏమీ చెయ్యలేడు: ఏడాదినిండని ఆ చిన్న కుర్రవాడి జబ్బేమిటో తెలియదు తనకు. ఎక్కడా ఎపుడూ చదువని విననిజబ్బు అది. రెండునెలలప్రాయంనుండి విపరీతమైన కడుపునొప్పి, గింజుకునేవాడు ఈ బిడ్డ. ఆ తర్వాత తాగినదంతా కక్కుకోవడం ఆరంభించాడు. కొన్నిరోజులకు దోకులో రక్తం పడసాగింది: నాలుగైదువారాల తర్వాత ఈ దశలో-వారంక్రింద తెచ్చారు తమ హాస్పిటల్ కు.

ప్రేగులలో ఎక్కడో ఏదో తప్పిపోయింది కాబోలు; పుట్టుకతోనే కడుపులో ఏదో సరిగా అతకలేదో, అతికి వుండవలసినది వీడిపోయిందో-అలాటిదేదో చిన్నపొరపాటు జరిగింది. కాని అది చాలు ఆ పసివాడి ప్రాణానికి। వాడి ప్రాణాన్ని కాపాడాలంటే ఆపరేషన్ చేసితీరాలి, కాని

ప్రస్తుతపుస్థితిలో తలపెట్టడమే అసంభవం. వాడిఒళ్ళు ఆపరేషన్‌కు తట్టుకోనేలేదు. అంచేత రక్తం ఎక్కించడం, గ్లూకోజునీళ్ళెక్కించడం, అతడి శరీరంలోని ద్రవాలు ఇగిరిపోకుండాచూడడం — ఇంతకన్న ఏమీచేయ్యలేదు తను. ఒకవేళ ఇందువలన అబ్బాయి దేహానికి కాస్తబలంవస్తే— ఆపరేషన్ తలపెట్టవచ్చు.

కాని వారమయింది వాళ్ళువచ్చి ఆ పిల్లవాడిఒంటికి బలం రావడంలేదు కదా, నానాటికీ పరిస్థితి దిగజారిపోతున్నది. మరీ విన్నటినుండి గూడా సన్నగిల్లిపోతూంది. కళ్ళ ఎక్కువసార్లు తెరవడంలేదు.

'హుఁ!' అనుకుని లేచాడు కృష్ణమూర్తి.

నెమ్మదిగా ఆరోనెంబర్ గదివైపు నడిచాడు.

ఆ గదిగుమ్మంలో నిలిచాడు. ఆమె, ఆ పాపాయితల్లి లేచి నిల్చుని-తననుచూచింది. ఆమెకళ్ళల్లోని ఆశ, భిక్ష-చూస్తే-అబ్బ! తను భగవంతుడిని కాకపోయానే అన్పించింది కృష్ణమూర్తికి. ఆమెవైపు చూడలేక, ఆ పసివాడివైపు చూచాడు.

నర్సు కమల, ఆ అబ్బాయి పక్కమీదకు కక్కుకున్న నెత్తురుని ఎంతో నేర్పుగా తుడుస్తూంది.

పైన గాజుకూజాలో రక్తం. ఇంకా పైన, గదికప్పునుండి వేలాడుతున్నదీపం. దీపానికి దిగువనున్న గాజుకూజా నీడ ఆ అబ్బాయి మొహం మీద పడుతూంది. వాడు నెమ్మదిగా శ్వాస పీలుస్తున్నాడు. కళ్ళ మూతపడి వున్నాయి. ఎర్రటిపెదవులు దీపపునీడలో వికారమైన ముదురురంగులో కనిపించాయి.

"బి. పి. నార్మల్‌గానే వుంది డాక్టర్!" అంది కమల ఉత్సాహంగా.

కథా నిలయం
3912
శ్రీకాకుళం

అల వూపాడు డాక్టర్. అయినా లాభంలేదు—అనుకుంటూ వెనక్కి తిరిగిన కృష్ణమూర్తికి ఆ అబ్బాయితండ్రి—గదిలో ఒకమూలగా నిల్చొని వుండడం కనబడింది.

'....దీని అంతటికీ మీరే కారణం. మొదటే, ఇంకో నెలముందే ఎందుకు తీసుకురాలేదు ఈ పాపాయిని? రోజుకో డాక్టర్నూ, పూటకొక మందుచొప్పున మార్చి మార్చి, చివరికి ప్రాణంమీద ప్రయోగాలు చేయ డానికి ఓపికలేకపోయినతర్వాత ఆఖరిక్షణాల్లో తీసుకొచ్చి మా ముందు పడేశారు. సమయంలో వచ్చివుంటే ఈ అబ్బాయి బ్రతికివుండేవాడు; బహుశ బ్రతికేవాడు. కానీ ఇప్పుడు—' అందామని అనుకున్నాడు కృష్ణ మూర్తి. కాని ఏమీఅనలేదు. ఆ పసివాడితండ్రి నొక్కసారిచూసి గదిబయ టకు నడిచాడు.

'ఏమిటి డాక్టర్! ఏమిటి మీ చూపుకు అర్థం? ఇంతకుముందొక బిడ్డను ధారపోసిన ఈ ఆస్పత్రికే ఇంకో బిడ్డను తీసుకొచ్చాననే—అది—అప రాధమా—ఇక్కడికే ఎందుకు తెచ్చాను? ఇంకెక్కడా ఆశలేక—ఆశకు సిగ్గు లేక—ఆశకు చావులేక! అక్కడా ఇక్కడా తిరగక తిన్నగా రాలేకపోయావా అనవచ్చు.... సరిగ్గా రెండునెలలక్రిందట—ఇదే ఆసుపత్రిలో మా కవలపిల్ల లలో మొదటివాడయిన భాస్కరాన్ని—అదిగో ఆ ఎనిమిదోనెంబర్‌గదిలో పోగొట్టుకున్నానే—అపుడు ఇంకెక్కడికీ వెళ్ళక మీరంతా దేవుళ్ళని తిన్నగా ఇక్కడికే ఎంతో నమ్మకంతోవచ్చానే—అప్పుడేమయింది డాక్టర్? నా నమ్మకం వమ్మయింది. కనీసం దివాకరాన్నయినా రక్షించుకోవాలన్న తాపత్రయంతో స్పెషలిస్ట్ అన్నవారికెల్లా చూపించాము; అడిగినదెల్లా ఫీజు కిందఇచ్చాము. క్రమక్రమంగా వీడూ భాస్కరంలాగే అయిపోతూంటే మనసు ఎడారిఅయి, ఇక్కడికివచ్చాము డాక్టర్—ఇక్కడికి వచ్చాము. అది తప్పా? అదీగాక, అదీగాక....' అని ఏదేదో గట్టిగా అడగాలనుకున్నాడు ఆ అబ్బాయితండ్రి. కాని నోరు విప్పలేదు. అతడి కళ్ళల్లో నీరు నిలిచింది.

అదిచూసి ఆమె ఏడుపు నాపుకోలేకపోయింది.

"ఎందుకమ్మా అధైర్యపడతారు" అన్నది కమల.

నా మనసులో రగులుతున్న చిచ్చు-ఎవరికేం తెలుసు—అంటున్నట్లు న్నాయి ఆ తల్లి వెక్కిళ్ళు.

ఆరోనెంబర్ గదివిడిచి వార్డుప్రక్కగా వచ్చాడు డాక్టర్ కృష్ణ మూర్తి. ఎవరో పిలిచారు. చూస్తే ఇరవైరెండోనెంబరు పడకమీద కవి గారు తనకు రాత్రంతా నిద్రరాలేదట; ఏదయినా నిద్రమాత్ర కావా లన్నాడు. అట్లాగేనని తనగదిచేరాడు కృష్ణమూర్తి.

వైద్యవిషయ పత్రిక నొకదానిని తిరగవేయసాగాడు. కాని మన సంతా ఆరోనెంబర్‌గదిలోని అబ్బాయిచుట్టూ తిరగసాగింది.

కవలపిల్లలలో రెండవవాడు ఈ అబ్బాయి మొదటిఅబ్బాయిని రెండునెలలక్రింద ఇట్లాగే తెచ్చారు. ఆ జబ్బుఏమిటో అర్థంకాలేదు. ఇవే లక్షణాలతో ఎనిమిదిరోజులు బాధపడి చనిపోయాడు.

అపుడు గనక శవపరీక్ష చేసివుంటే పెద్దసమస్య విడివుండేది. చీకటితెరలు తొలగిపోయేవి. ఈ అర్థంకాని జబ్బురూపంతెలిస్తే దానితో పోరాడడం సులభమయ్యేది. కాని వాళ్ళే—ఈ తలిదండ్రులే ఒప్పుకోలేదు. తాను వీళ్ళకు అన్నీ వివరించాడు;అర్థంచేసుకోమనిప్రార్థించాడు; ప్రాదేయ పడ్డాడు. కాని తమఅబ్బాయి దేహాన్ని ఇవ్వడానికి ససేమిరా ఒప్పుకోలేదు ఆ తల్లిదండ్రులు. పైపెచ్చు తనమీదకోపంతో, మా ముద్దులపట్టి శరీ రాన్ని ముక్కలు చేయడానికిమ్మంటున్నావే—నువ్వెంత క్రూరుడివి అన్న జుగుప్సతో వెళ్ళిపోయారు, ఆ అబ్బాయి దేహంతో.

అదంతా ఈ క్షణాన జరిగినట్లుంది—అనుకున్నాడు డాక్టర్ కృష్ణ మూర్తి.

గడియారం తొమ్మిది కొట్టింది.

అపుడే గనుక ఆ పెద్దబ్బాయి దేహాన్ని పరీక్షించివుంటే ఈనాడు ఈ పసివాడు-బహుశ బ్రతికేవాడు!-

చప్పుడయింది; ఎల్లయ్య భోజనం కేరియర్ తెచ్చిపెట్టాడు. స్టీల్ కేరియర్‌మీద నీలందీపపు కాంతి పొడుగాటి గీతలా ఒకవైపు మాత్రమే పడుతూంది.

"మరచిపోకుండా భోంచేయమన్నారు అమ్మగారు—" అన్నాడు ఎల్లయ్య.

నవ్వుకున్నాడు కృష్ణమూర్తి. ఎపుడో రెండుమూడుసార్లు పెద్ద అపరేషన్లలోపడి రాత్రిళ్ల భోజనంచేయలేకపోయాడు. అందుకని శారదకు సదా అనుమానం! ప్రతిసారీ—ఈ హెచ్చరికతో కేరియర్ పంపిస్తుంది.

"అట్లాగేలే-నువ్వెళ్ళు-" అన్నాడు కృష్ణమూర్తి.

"మంచిదండీ....మరేమో, అమ్మగారు, మీరు భోజనంచేసిందాకా వుండి కేరియర్ తెమ్మన్నారండి -"

పెద్దగా నవ్వేసి-"ఎల్లయ్యా! నే నప్పుడే అన్నంతినలేను. నువ్వింటికిపో" అన్నాడు కృష్ణమూర్తి.

ఎల్లయ్య వెళ్లిన రెండునిమిషాలకు కమల వచ్చింది.

"ఊ....బంగాళదుంపల వేపుడు ఘుమాయిస్తూంది....బలే బాగుందేట్లుంది మీ శ్రీమతిచేతి పాకం!"

"కేరియర్ మూత తీయనిదే నీకు వాసనెట్లా వచ్చిందీ?"

"ఎక్స్-రే ముక్కండీ డాక్టరుగారూ," అని నవ్వింది కమల.

"ఎవరయినా అందమైన చిన్నవాడి మనసుని ఎక్స్-రే తీయవమ్మా-" అన్నాడు కృష్ణమూర్తి.

నర్స్ లోపలదాక్కు-నివున్న ఆడది సిగ్గుపడింది. ఆ చిరునవ్వుకూ, ఆమె యూనిఫారానికీ స్నేహం కుదరలేదు.

"ఊ!....అన్నట్లు .... ఆరోనెంబర్‌గదిలో అబ్బాయి ఎట్లా వున్నాడు?"

పెదవి విరిచింది కమల.

"ఓహో!" అని చేతికి గడ్డాన్ని ఆనించి కళ్ళు మూసుకున్నాడు కృష్ణమూర్తి.

"ముందులేచి, భోజనం ముగించండి. ఆ తర్వాత తీరికవుంటుందో వుండదో."

మళ్ళీ 'ఆడది !' అనుకున్నాడు అతడు. బ్రాండేటీ, గ్లూకోజు సీసా తీసుకెళ్తున్న ఆమెను చూసి.

ఇంతలో ఫోన్ అరిచింది. అందుకున్నాడు.

"కృష్ణమూర్తీ ! నేను సారథిని మాట్లాడుతున్నాను—నిన్న మీకు చెప్పానే, ఆ 'బ్రెయిన్' కేసు ఆపరేషన్ ఇంకో అరగంటలో మొదలెడు తున్నాము. వస్తారా?"

నిముషం తర్వాత ఫోన్‌ని క్రిందపెట్టాడు కృష్ణమూర్తి.

కేరియర్‌ని విప్పాడు. అయిదుగిన్నెలనిండా ఏమేమిటోవున్నాయి— రెండుపూటలా శాస్త్రోక్తంగాపప్పు, పులుసు, కూర, పచ్చడి—తనే ఓపికగా చేస్తుంది. వద్దని చెబుతేవినదు. పైపెచ్చు 'బ్యాలెన్స్‌డయిట్' వగైరా అంటూ తనకే అప్పచెబుతుంది, కొంటెపిల్ల అవునుమరి. పెళ్ళయి ఎనిమి దేళయ్యినా శారద ఇంకా తల్లికాలేదు.అంచేత ఇంట్లోఅల్లరిఅంతాఆమెదే— అనుకుంటూ బంగాళాదుంప వేపుడుముక్క ఒక్కటి నోట్లో వేసు కున్నాడు; పెరుగుతాగాడు. మళ్ళీ గిన్నెలన్నీ సర్దేసి చేతులూ, మొహమూ కడుక్కొని మెట్లు దిగసాగాడు కృష్ణమూర్తి.

అతడు మళ్ళా మేడమెట్లు ఎక్కుతుండగా క్రింది వరండాలో గడి యారం రెండుకొట్టింది. అబ్బా! అనుకున్నాడు. రిస్టువాచి చూచుకున్నాడు. మొదటిఅంతస్తుమీని తనగదిలోకివచ్చాడు. కుర్చీలోకి కూలబడి టేబిల్

మీదికి కాళ్ళుజాచాడు. టేబిల్ మీద తా నుంచిన కేరియర్ టేబిల్ క్రింద వుంది: కమలపని కాబోలు....

అమ్మయ్య! ఆ మెదడు ఆపరేషన్ సరిగానే జరిగింది. ఆవిడకు పాతికేళ్ళుంటాయేమో: మాటి మాటికీ 'ఫిట్సు' రోజుకు ముప్ఫైసార్లు నలభై సార్లువస్తాయట: అందుకు కారణమైన చెడినమెదడుభాగాన్ని తీసి వేయడానికి సాహసించాడు. ఆపరేషన్ ఫలితంగా ఫిట్స్ ఆగుతాయేమో కాని, ఎక్కడ ఆమెకు చూపు పోతుందో, లేక ఏ పక్షవాతం వస్తుందో— అని తాను భయపడ్డాడు. కాని దైవకృపవలన అట్లాంటిదేమీ జరగలేదు. ఆమెకు బహుశ 'ఫిట్స్' ఇక రానేరావు: ఆమె విందు ఆరోగ్యంతో హాయిగా బ్రతుకుతుంది. ఎంతఅద్భుతమైనమార్పు !! ఇదంతా కేవలం ఆ ఆపరేషన్ ఫలితం.

డాక్టరుది—చావు బ్రతుకులమధ్య అదొౌకలోకం. మనిషికీ దేవుడికీ మధ్య అదొౌకఎత్తు. అక్కడినుండి దిగివచ్చాడు తను.

అన్నట్లు!—హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చింది! గభుక్కునలేచాడు కృష్ణమూర్తి. ఆ క్షణాన్నే పరుగెత్తుకుంటూ వచ్చింది కమల.

"డాక్టర్! ఆ అబ్బాయి మరణించాడు. అయిదారు నిముషా లయింది—"

ఇంక తనేళ్ళిచూసేదేమీలేదు. వెనక్కెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు కృష్ణమూర్తి.

హుం! ఆపరేషన్ తర్వాత ఇందాకటి ఆ భావం ఎగిరిపోయింది— అదొౌక ఎత్తుట, అదొౌక లోకంట. ఎంతటి అహంభావం .... ఇప్పు దేమీటిట ?!

"మీరు ఆపరేషన్ థియేటర్‌లోవున్నారని డాక్టర్ శ్రీధర్‌ని పిలిచాను. గంటసేపునుండీ ఆయన ఆ అబ్బాయిపక్కనే వున్నాడు. ఇప్పుడే వెళ్తున్నారు."

"ఆయనకి నాథాంక్స్ చెప్పుకమలా."

కమల మెట్లవైపు పరుగెత్తింది.

రెండుచేతుల్ని మెడవెనుక వుంచుకుని తల పైకెత్తి దీపాన్ని చూశాడు డాక్టర్ కృష్ణమూర్తి. పురుగులు రెండో మూడో ఎగురుతున్నాయి ؛ దీపాన్ని తాకేంత దగ్గరగా వస్తున్నాయి. మరుక్షణం దూరంగా వెనక్కు పోతున్నాయి.

చూడగా చూడగా ఆ దీపం రెండుదీపాలైంది. ఆ రెండుదీపాలు కళ్ళుగా—ఆ కళ్ళు తనబిడ్డకు ప్రాణం పోయమంటున్న తల్లిగా కనుపించింది.

ఎట్టకేలకు దీపాన్ని తాకిన ఒక పురుగు చచ్చి కృష్ణమూర్తి మెడ మీదపడింది. ఉలిక్కిపడ్డాడు అతడు.

ఎప్పు డొచ్చాడో మరి—తన రెండవబిడ్డను కొన్ని నిముషాల క్రితం పోగొట్టుకున్న ఆ తండ్రి—టేబిల్‌ప్రక్కగా నిల్చునివున్నాడు. పెదవులు కదిలాయి.

"డాక్టర్ ؛ మా అబ్బాయి దేహాన్ని శవపరీక్షకు తీసుకోండి ؛"

కృష్ణమూర్తిచెవులు నమ్మనన్నై.ఏదోఅందామంటేగొంతుపెగల్లేదు.

ఆ తండ్రిమొహం నిశ్చలంగా- తపస్సునుండి లేచివచ్చినవాడిలా వుంది.

"రెండునెలలక్రింద మా మొదటిబిడ్డ దేహాన్ని పరీక్షనిమిత్తం మీ కప్పగించివుంటే మా రెండోఅబ్బాయి బ్రతికేవాడేమో—కాని మారాత అడ్డువచ్చింది—"

కృష్ణమూర్తిలో తుఫాను రేగింది. మొత్తంమీద అతడు చెప్పగలిగాడు.

"ఇప్పుడు ఈ అబ్బాయిదేహాన్ని పరీక్షించినా వచ్చేలాభమేమీ లేదు—"

"తెలుసుడాక్టర్....నాకా విషయం. కాని, వాడిదేహాన్ని పరీక్షించి మీరేమయినా తెలుసుకుంటే ఆ జ్ఞానం ఇంకెక్కడో, ఎప్పుడో, ఎవరి బిడ్డనో రక్షించవచ్చును. అప్పుడు—మా రెండవబిడ్డను చంపుకున్న మా పాపంకాస్తా తీరుతుంది!" అన్నాడు ఆ తండ్రి, ఆ గదిలో వెయ్యిదీపాలు వెలిగినట్లయింది.

అవన్నీ ఆ తండ్రి కళ్ళల్లోవివే—అనుకున్నాడు కృష్ణమూర్తి.అతడి చేతుల్ని తనచేతుల్లోకి తీసుకున్నాడు.

"భగవాన్! నీచేతి సాధనంగా ఎన్నుకున్నావు, దారిచూపే బాధ్యత కూడా నీదే!" అనుకున్నాడు డాక్టర్ కృష్ణమూర్తి.

('యువ' సెప్టెంబర్ 65)